భక్తిశ్రద్ధలతో రంజాన్




పాణ్యంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు,శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

కోడుమూరు/పాణ్యం:నియోజకవర్గ వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గత నెల రోజుల నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు ఉండి రోజా పాటిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెలవంక కనిపించడంతో శనివారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆయా ఈద్గాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రార్థనలు జరిగాయి. మత గురువులు ఖురాన్ పఠనం చేసి అల్లా మార్గంలో నడుచుకోవాలని సందేశమిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సి.బెళగల్: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు ఆయా గ్రామాల మసీదుల వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అల్లాహ్ అక్బర్ అంటూ ప్రార్థిస్తూ ఈద్గాలకు వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వస్తద్‌లు, అఫిసాబ్‌లు ఖురాన్ ప్రబోధాలను వివరించారు. సి.బెళగల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన హాఫీసాబ్ జకరియా ప్రార్థనలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపవాసం, సేవాభావం, దానం వంటి అంశాలతో దేవుడి కృప, పుణ్యం కలుగుతాయన్నారు. మండలంలోని గొల్లలదొడ్డి, సంగాల, పోలకల్, మారందొడ్డి, ముడుమాల, గుండ్రేవుల, కొత్తకోట, కంబదమాల్ తదితర గ్రామాలలో ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కోడుమూరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గూడూరులో ప్రార్థనలు చేసేందుకు వెళుతున్న ముస్లింలు



సి.బెళగల్‌లో ఈద్గాకు తరలివెళుతున్న ముస్లింలు



ఓర్వకల్లులో ఖురాన్ సందేశమిస్తున్న మత గురువు



సి.బెళగల్‌లో దువా చేస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

గురుకుల ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

సి.బెళగల్: సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం నిర్వహించనున్న పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. పాఠశాలలో ఉదయం జరిగే ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 776 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరు పరీక్ష రాసేందుకు 32 గదులను సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు ఉదయం 9:30 గంటల్లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రవేశానికి 441 మంది విద్యార్థులు హాజరు కానున్నారనిని, వీరు పరీక్ష రాసేందుకు 18 గదులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ విద్యార్థులు మధ్యాహ్నం ఒంటిగంటలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని 2 నుంచి 4:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. పరీక్షా గదుల్లో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

సి.బెళగల్: సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పరామర్శించారు. భాస్కర్ రెడ్డి భార్య లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు.విషయాన్ని మండల నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మండల నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ రెడ్డికి సానుభూతి తెలుపుతూ, ధైర్యంగా ఉండాలని సూచించారు.ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను,ప్రభాకర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, క్రిష్టారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

కూలీలకు మజ్జిగ సరఫరా చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగన్న

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వేసవిని దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశంలో చల్లని మజ్జిగ సరఫరా చేయాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలో ని భైరాపురం గ్రామం వద్ద జరుగుతున్న ఉపా.ది పనులను ఆయన పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా నాగ న్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వ ఆ. దీనంలోకి తీసుకున్న తర్వాత ఉపాధి పథకంలో పలు మార్పులు తీసుకొచ్చిందన్నారు. తద్వారా కూలీలకు గిట్టుబాటు వేతనం రాకపోవడమేగాక, బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శించారు. పనిముట్ల నిమిత్తం వచ్చే అలవెన్సులు సరిగా చెల్లించడం లేదన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కూలీల సమస్యలను దృష్టిలో పెట్టుకొని 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించి, వారం వారం పేస్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ కె.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్ (సీపీఎం ఆఫీస్)లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని, బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్ వ్యాధులకు వైద్యులు గోపాలం, శివనారాయణ, భరత్, నాగభూషణరావు, కె.సంధ్య, పర్వీన్ హాజరై రోగులకు పరీక్షలు చేస్తారన్నారు. రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం

కర్నూలు: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పొరుగు రాష్ట్రాల మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు ధ్వంసం చేశారు. కర్నూలు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం రూ.2 లక్షల విలువ చేసే మద్యంను ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 5,715 మద్యం టెట్రా ప్యాకెట్లు, 1,411 లీటర్ల నాటుసారాను నగర శివారులోకి తీసుకెళ్లి వాహనాలతో తొక్కించి నేలపాలు చేశారు.

నేడు కళాకారులకు సన్మానం

కర్నూలు కల్చరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 'మత సామరస్యం - శాంతి సందేశం' పేరుతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అ. ధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. హిందూ, ముస్లిం కవులు సమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు. 2013 -2023 వరకు నంది, గరుడ, కందికూరి తదితర జాతీయ స్థాయి అవార్డులు అందుకున్న 10 మంది టీజీవీ కళాక్షేత్రం కళాకారులను సన్మానించనున్నట్లు తెలిపారు. సెర్ప్ సీఈఓ ఐఏఎస్ ఏఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను సన్మానిస్తారని పేర్కొన్నారు.

అకాల వర్షంతో రైతుల ఇక్కట్లు

పాణ్యం:మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో రైతులు అవస్థలు పడుతున్నారు. రబీలో సాగు చేసిన వరి దిగుబడులు ఇళ్లకు వచ్చే తరుణంలో ఈదురుగాలులు, ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడం, అక్కడక్కడ జల్లులు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.మొక్కజొన్న, మిరప, ఇతర దిగుబడులను కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టుకున్న రైతులు వర్షానికి దిగుబడులు తడిసిపోకుండా పట్టలతో కప్పి కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం 50 శాతం మేర వరి, మిరప ఇంకా పొలాల్లోనే ఉంది. ఇక మామిడి కాయలు చెట్లపై ఉన్నందున గాలుల ధాటికి రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. వర్షాలకు దిగుబడులు తడిసిపోతే ధర తగ్గుతుందేమోనని రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.



నెరవాడమెట్ట వద్ద మొక్కజొన్న దిగుబడులు తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

అల్లా చూపిన మార్గంలో నడవాలి

కల్లూరు: అల్లా చూపిన మార్గంలో నడుస్తూ పేదలకు చేతనైన సాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పవిత్ర రంజాన్ సందర్భంగా కల్లూరు అర్బన్ 35వ వార్డులోని మసీదులో జరిగిన నమాజ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదు కమిటీ సభ్యులు, కార్పొరేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

– కల్లూరు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులో ప్రవక్తలు ఖురాన్ చదివి వినిపించారు. ప్రతి ఒక్కరు ఇతరుల పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కల్లూరులో రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఆర్‌యూకు వేసవి సెలవులు ఇప్పించాలి

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ఇప్పించాలని కోరుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల లెక్చరర్స్ అసోసియేషన్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విలీన సిబ్బంది సంఘం నాయకులు శనివారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి విన్నవించారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల పరిధిలో డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులు, అధ్యాపకుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వేసవి సెలవులు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై వర్సిటీ వీసీకి ఎమ్మెల్యే ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.దీంతో రెండు రోజుల్లో విజయవాడకు వెళుతున్నానని,విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సెలవులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఆయా సంఘాల నాయకులు డి నాగన్న, దలవాయి శ్రీనివాసులు, ఎస్.సోమశేఖర్, తదితరులు ఉన్నారు.

మే 31న ఢిల్లీలో వాల్మీకుల సంకల్ప దీక్ష



కరపత్రాలు విడుదల చేస్తున్న సుభాష్‌చంద్రబోస్, వాల్మీకులు

పత్తికొండ రూరల్: మే 31న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్షకు పెద్ద ఎత్తున వాల్మీకులు తరలిరావాలని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ కోరారు. శనివారం స్థానిక వాల్మీకి రామాలయంలో వాల్మీకి సంఘం నాయకులతో కలిసి సంకల్ప దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ గత మార్చి 24న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయడం సంతోషకమరన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్టీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఢిల్లీలో సంకల్ప దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆస్పరి నరేంద్ర, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు శివశంకర్‌నాయుడు, సుధాకర్, శ్రీను, జయరాముడు, వెంకటేశ్వర్లు, బాలు తదితరులు పాల్గొన్నారు.

24న రాయలసీమ కర్తవ్య దీక్ష



పోస్టర్లను విడుదల చేస్తున్న స్టీరింగ్ కమిటీ నాయకులు

కర్నూలు సిటీ: రాయలసీమ ప్రాంతానికి నిధులు, నీళ్లు, నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని, అప్పర్‌భద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ కర్తవ్య దీక్ష చేపట్టనున్నారు. ఈ దీక్షకు సంబంధించిన పోస్టర్లను రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆ కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు సీమ కృష్ణ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీటి విషయంలో అన్యాయం చేస్తూ అప్పర్ భద్ర ప్రాజెక్టును ఎగువ రాష్ట్రంలో నిర్మిస్తున్నారని, దీని వల్ల దిగువన ఉన్న సీమ జిల్లాలకు తుంగభద్ర జలాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సిద్దేశ్వరం - సంగమేశ్వరం వద్ద తీగల బ్రిడ్జికి బదులు రోడ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎస్టీబీసీ కాలేజీలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. దీక్షకు పెద్ద ఎత్తున సీమవాసులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు మల్లప్ప, హరినాయుడు, భూషన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రూ.16 లక్షల పన్ను వసూళ్లు

కర్నూలు (టౌన్): సెలవు రోజుల్లోనూ నగరపాలక పన్ను కౌంటర్లు పనిచేయడం ద్వారా రెవెన్యూ విభాగానికి గణనీయంగా ఆదాయం సమకూరుతోంది. శనివారం రంజాన్ పండుగకు నగరపాలక సంస్థ కార్యాలయానికి సెలవు ఉంది. అయినా పన్ను దారుల సౌలభ్యం కోసం ప్రత్యేక కౌంటర్లు పనిచేశాయి. దీంతో నగరవాసులు పలువురు పన్నులు చెల్లించేందుకు ముందుగా వచ్చారు. ఒకేరోజు ఆస్తి పన్ను కింద రూ.14.26 లక్షలు, నీటి పన్ను కింద రూ. 1.12 లక్షలు, ట్రేడ్ లైసెన్సు ద్వారా రూ.3,750 చొప్పున పన్నులు వసూలయ్యాయి. మొత్తం రూ. 16.14 లక్షలు వసూలైనట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు వెల్లడించారు.

5 శాతం రాయితీని వినియోగించుకోండి

2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. ఈ నెలాఖరు వరకు 5 శాతం రాయితీతో పన్నులు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. పన్ను చెల్లింపు దారుల కోసం ఆదివారం సైతం ప్రత్యేక పన్ను కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.



పన్నుల చెల్లింపులను పర్యవేక్షిస్తున్న నగర పాలక మేనేజర్ చిన్నరాముడు

24న సత్యసాయి ఆరాధన

కర్నూలు కల్చరల్: సత్యసాయి ఆరాధనను ఈనెల 24వ తేదీన నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. స్వామి వారి ఆరాధనను పురస్కరించుకొని ఆదివారం నగర సంకీర్తన, వేదం, భజన, సాయంత్రం 6.30 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 24వ తేదీ ఉదయం 5.30 గంటలకు నగర సంకీర్తన, అష్టోత్తర పూజ, మజ్జిగ పంపిణీ సేవ, నారాయణులకు ఆహారం పంపిణీ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన రంగనాయకులు

కోడుమూరు: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన రంగనాయకులు (36) అనే వ్యక్తి శనివారం రాత్రి రామాపురం బస్ స్టేజీ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రంగనాయకులు వెల్దుర్తికి బైక్‌పై వెళ్లి అల్లినగరం గ్రామానికి తిరిగి వస్తుండగా ఏదైనా వాహనం తగిలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడా? లేక ఎవరైనా గిట్టనివారు హత్య చేశారా? అనే కోణంలో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించడంతో పాటు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రంగనాయకులుకు భార్య మంజులతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

25 నుంచి వేసవి శిబిరం

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 8వ తేదీ వరకు చిన్మయ బాలల వేసవి సాధనా శిబిరం నిర్వహించనున్నట్లు స్వామిని సుప్రేమానంద సరస్వతి పేర్కొన్నారు. వీఆర్ కాలనీలో చిన్మయ ప్రభావళి ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 1 గంట వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల వయసుగలవారు శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు. నైతిక విలువలు, భగవద్గీత, యోగా- ధ్యానం, జ్ఞాపక శక్తిని పెంపొందించే మంత్రాలు, ఆధ్యాత్మికత, స్తోత్రాలు, ఆటలు, నృత్యాలు, డ్రామా, స్కిట్‌లు, భజనలు, విష్ణు సహస్ర నామాలు నేర్పించనున్నట్లు వెల్లడించారు.

రోడ్డుపై చీలికలు.. మృత్యు పిలుపులు

- నిలువునా చీలిన గడివేముల-నంద్యాల రోడ్డు
- చీలికలలో టైరు పడితే అంతే సంగతులు
- గతంలో 30 కి.మీ సీసీ రోడ్డు వేసుకున్న జిందాల్ యాజమాన్యం
- రోడ్డు దెబ్బతిన్నా ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించని వైనం
- వరుస ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



గడిగరేవుల-తిరుపాడు గ్రామాల మధ్యలో రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

గడివేముల: ఆ రోడ్డులో ప్రయాణించాలంటే చాలా జాగ్రత్తగా వెళ్లాలి. లేకుంటే ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. రోడ్డుపై నిలువునా ఏర్పడిన పగుళ్లు మృత్యు పిలుపులుగా మారాయి. వాహన టైరు పగుళ్లలో పడితే అంతే సంగతులు. గతంలో గడివేముల నుంచి నంద్యాల వెంకటేశ్వరపురం వరకు రోడ్డు చాలా దారుణంగా ఉండేది. 2007లో బిలకగూడూరు గ్రామ సమీపంలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైంది. జిందాల్ యాజమాన్యం ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి అనుమతులు తెచ్చుకుని ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం వరకు సొంతంగా సీసీ రోడ్డు నిర్మించింది. అంతవరకు బాగానే ఉన్న ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు రోడ్డుపై రాకపోకలు సాగించడంతో నిలువునా పగుళ్లు ఏర్పడ్డాయి. భారీగా ఏర్పడిన చీలికలకు తారుపూసి రోడ్డు మరమ్మతులు చేసినట్లు జిందాల్ యాజమాన్యం చూపించుకున్నారు. ముఖ్యంగా గడిగరేవుల-తిరుపాడు గ్రామాల మధ్యలో సీసీ రోడ్డు నెర్రలివ్వడంతో ద్విచక్రవాహనాలు వెళ్లేటప్పుడు టైరు చీలికలో పడడం వల్ల అనేక ప్రమాదాలు జరిగాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నెర్రలిచ్చిన రోడ్డుపై ద్విచక్ర వాహదారులు అనేక మంది ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. జిందాల్ యాజమాన్యం సీసీ రోడ్డు నిర్మించుకున్న అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించాల్సి ఉండగా అలా చేయలేదు. దీంతో రోడ్డు మరమ్మతులను జిందాల్ యాజమాన్యమే చేపట్టాలని అధికారులు చెబుతున్నారు. పగుళ్లు ఇచ్చిన చోట తుతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదానికి గురైన బైకు (ఫైల్)

ప్రయాణాలకు ఇబ్బంది



గడివేముల నుంచినంద్యాలకు జిందాల్ యాజమాన్యం నిర్మించిన సీసీ రోడ్డులో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. భారీ వాహనాల రాకపోకల వల్ల సీసీ రోడ్డుపై పగుళ్లు వచ్చాయి. జిందాల్ యాజమాన్యం రోడ్డు మరమ్మతులు చేయడం లేదు. రోడ్డు చీలికలో బైకు టైరు పడిందంటే అంతే సంగతి. అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన పగుళ్లను పూడ్చివేయాలి. **– చింతల నారాయణ, గడిగరేవుల గ్రామం**

ప్రమాదాలను నివారించండి



జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం వరకు వేసిన సీసీ రోడ్డుపై పగుళ్లను పూడ్చి ప్రమాదాలు అరికట్టాలి. ముఖ్యంగా గడిగరేవుల-తిరుపాడు గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తి అధ్వానంగా ఉంది. మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలి. రోడ్డు ఆర్‌అండ్‌బీ ఆధీనంలో ఉంటే బాగుంటుంది. **–ఎల్లా సుధాకర్, డ్రైవర్**

ఆర్‌అండ్‌బీకి అప్పగించలేదు

బిలకలగూడూరు గ్రామం నుంచి వెంకటేశ్వరపురం వరకు జిందాల్ యాజమాన్యం నిర్మించిన సీసీరోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించలేదు.దీంతో రోడ్డు దెబ్బతిన్న చోట జిందాల్ యాజమాన్యమే మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.రోడ్డు నిర్వాహణ జిందాల్ చూసుకోవాలి.రోడ్డుమరమ్మతుల కోసం ఏటా జిందాల్ యాజమాన్యం డబ్బులు చెల్లిస్తుంది.రోడ్డు బాగాచేసిన తరువాత ఆర్‌అండ్‌బీ శాఖ స్వాధీనం చేసుకుంటుంది. **–సురేష్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఆత్మకూరు డివిజన్**